సాక్షి హనుమకొండ

ఆదివారం । 3 । ఆగస్టు । 2025



ఎన్‌జీటీ సూచనలు అమలు చేయండి

పలు పనుల విషయంలో అధికారులు ఎన్‌జీటీ సూచనలు అమలు చేయాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. - 8లో▸



రేపటినుంచి తనిఖీలు - 8లో▸

హనుమకొండ జిల్లాలో నిర్వహిస్తున్న ప్రైవేట్ క్లినిక్‌లు, ఆస్పత్రుల్లో సోమవారంనుంచి తనిఖీలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి అప్పయ్య తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$35^0/24^0$

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అమ్మవారిని దర్శించుకున్న దేవాదాయశాఖ ఆర్‌జేసీ



హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయాన్ని శనివారం దేవాదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ మల్లెల రామకృష్ణారావు కుటుంబసమేతంగా సందర్శించారు. ఆయన వెంట సినీ దర్శకుడు నెల్లుట్ల ప్రవీణ్ చందర్ ఉన్నారు. వారిని ఆలయ అర్చకులు భద్రకాళి శేషు ఘనంగా స్వాగతించారు. అమ్మవారికి పూజలు నిర్వహించుకున్న అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు. అలాగే తెలంగాణ రాష్ట్ర అయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి దంపతులు తమ వివాహవార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాజీపేట జంక్షన్‌కు నేడు రైల్వే డీఆర్‌ఎం

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో ఈనెల 3న దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) డాక్టర్ గోపాలకృష్ణన్ పర్యటించనున్నారు. ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ప్రత్యేక రైల్లో సికింద్రాబాద్ నుంచి బయలుదేరి కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటారు. అనంతరం జంక్షన్‌లోని రైల్వే యార్డు, డ్రైవర్ల కార్యాలయం, రన్నింగ్ రూంలను తనిఖీ చేస్తారు. కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్‌ను తనిఖీతో పాటు కాజీపేట జంక్షన్‌లో నిర్మించిన షటిల్ కోర్టును ప్రారంభించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

హనుమకొండ డీఆర్‌ఓగా రాజా గౌడ్

హన్మకొండ అర్బన్ : హనుమకొండ జిల్లా రెవెన్యూ అధికారిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.రాజాగౌడ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకాలం డీఆర్‌ఓగా పనిచేసిన వైవీ గణేష్‌కు ఇంకా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న రాజాగౌడ్‌కు హనుమకొండ కేటాయించారు. సోమవారం ఆయన విధుల్లో చేరనున్నట్లు సమాచారం.

వరంగల్ విద్యార్థులకు బంగారు పతకాలు



హన్మకొండ: వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థులకు బంగారు పతకాలు లభించాయి. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవంలో అవార్డుల ప్రదానం జరిగింది. యూనివర్సిటీ చాన్సలర్, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్, డీఏఆర్‌ఈ సెక్రటరీ మంగీలాల్ జాట్ ముఖ్యఅతిథిలుగా పాల్గొని అవార్డులు అందించారు. వరంగల్ వ్యవసాయ కళాశాలకు చెందిన ఆర్షియా తబస్సుమ్‌కు నాలుగు బంగారు పతకాలు, బండెవాల శ్వేత, ఏనుగు మానసకు బంగారు పతకం అందుకున్నారు. అవార్డులు అందుకున్న విద్యార్థులను వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధ్యాపకులు అభినందించారు.

వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ప్రారంభం



హన్మకొండ అర్బన్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధుల కోసం ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, రెడ్ క్రాస్ సొసైటీ ప్యాట్రన్ నాయిని రాజేందర్‌రెడ్డి శనివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని 33జిల్లాల్లో 37 డే కేర్ సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డా.పి.విజయచందర్‌రెడ్డి, సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం వృద్ధులను చేనేత టవల్స్‌తో సత్కరించారు. తలసేమియా పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ కోశాధికారి బొమ్మిరెడ్డి పాపిరెడ్డి, సభ్యులు ఈవీ శ్రీనివాస్‌రావు, వేణుగోపాల్, శేషుమాధవ్, రమణారెడ్డి, మహిళా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ అధికారి జయంతి, అనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కల్మషం లేనిది స్నేహబంధం



- ఇద్దరికి మించి స్నేహితులు అవసరం
- అమ్మానాన్న తర్వాత ఫ్రెండ్‌కే ప్రాధాన్యం
- ఉమ్మడి వరంగల్ జిల్లా యువత మనోగతం

స్నేహం అంటే మనుషుల్ని కలిపే వారధి. కష్టసుఖాలను పంచుకునే ఓ అనుభూతి. కష్టం వచ్చిందంటే నేనున్నానంటూ 'చేయి' అందించే ఓ రూపం.. ప్రపంచంలో ప్రతీ బంధానికి ప్రత్యేకత ఉంటుంది. తల్లిదండ్రులు మనకు జన్మనిస్తారు..బంధువులు సహజంగా లభిస్తారు.. కానీ స్నేహితులు మాత్రం మనం మన చేతిగా ఎంచుకునే బంధం. అలాంటి అపూర్వమైన అనుబంధాన్ని గుర్తుచేసుకునే రోజు స్నేహితుల దినోత్సవం. ఈ నేపథ్యంలో స్నేహబంధంపై ఉమ్మడి వరంగల్ జిల్లా యువత మనోగతంపై సాక్షి సర్వే నిర్వహించింది. ఇప్పటికీ, ఎప్పటికీ కల్మషం లేనిది స్నేహబంధమని చెప్పుకొచ్చారు. ప్రతీ ఒక్కరికి జీవితంలో ఇద్దరికంటే ఎక్కువ స్నేహితులుండాలని, అప్పుడే ఏదైనా ఆపద వస్తే అండగా ఉంటారని చెప్పారు. - సాక్షి నెట్‌వర్క్

సర్వే శాంపిల్స్ 120 (ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆరు జిల్లాలు.. ప్రతీ జిల్లానుంచి 20మంది చొప్పన)
(10 మంది యువకులు, 10మంది యువతులు)



సండే స్పెషల్

లింగభేదాలకు అతీతం.. కులమతాలకు వ్యతిరేకం..కష్టాల్లో గుండె నిబ్బరం. రంగుల కలలను రంగరించే ప్రత్యేక లోకం. అదే స్నేహ బంధం దృగంతాలను చుట్టి రావాలన్నా.. అంబరాన్ని అందుకోవాలన్నా.. సందర్భమేదైనా జిందగీలో దోస్తానా అనేది ఉంటే.. దిల్.. జిగేల్ అనాల్సిందే! అలాంటి స్నేహ మాధుర్యానికి నేడు (ఆదివారం) స్నేహితుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' అక్షర రూపం ఇచ్చింది.



దిల్‌ఖుష్ దోస్తానా

కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న స్నేహితులు • ఆర్థికంగా ఆదుకుంటున్న పూర్వ విద్యార్థులు

ఆదర్శంగా నిలుస్తున్న ఉమ్మడి జిల్లా దోస్తులు

పాతికేళ్ల అనుబంధం



ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన ముగ్గురు స్నేహితులు కత్తెర శ్రీనివాస్, గుంత రమేశ్, మహ్మద్ అజహర్‌పాషా 1995–96లో ఏటూరునాగారం జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుకున్నారు. అప్పటి నుంచి ముగ్గురిలో ఎవరికి ఏ కష్టం వచ్చినా తామున్నామంటూ కలిసే నడుస్తున్నారు. ఇటీవల అజహర్‌కు కారు ప్రమాదం జరగగా కత్తెర శ్రీను, గుంత రమేశ్ అన్నీ తామై చూసుకున్నారు. తమ ప్రాణాలు పోయేదాకా స్నేహం కొనసాగుతుందని వారు చెబుతున్నారు.

స్నేహితం.. సేవే అభిమతం



మిత్రుడి కుమార్తె ఫీజు కోసం స్నేహితుల ఆర్థిక సాయం

తొర్రూరు: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984–85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆపదలో స్నేహితులకు ఆర్థిక చేయూతనిస్తూ ఆసరాగా నిలుస్తున్నారు. తీవ్ర అనారోగ్యం బారిన పడి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న చాట్ల సంపత్‌ను బతికించాలనే సదుద్దేశంతో రూ.1.3 లక్షలు సమీకరించి చికిత్స అందించారు. అదేవిధంగా కంఠాయపాలెం గ్రామానికి చెందిన ఆర్ఎస్ చారి అనారోగ్యం బారిన పడి ఆర్థికంగా చితికిపోగా, గుర్తించిన మిత్రులు రూ.50 వేలు జమ చేసి అందజేశారు. పదో తరగతి మిత్రుడు నాగేశ్వరావు ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తుండగా బస్సు ప్రమాదంలో అతడి కాళ్లు విరిగాయి. ఆరు నెలలు డ్యూటీ లేకుండా ఇంట్లోనే ఉండడంతో కూతురు చదువుకు ఫీజు చెల్లించలేని పరిస్థితి. ఆ సమయంలో మేమున్నామంటూ సహచర పదో తరగతి మిత్రులు రూ.70 వేలు అందించారు.

కలిసి నడుస్తున్న బాల్యమిత్రులు..



దేవరుప్పుల: బడికెళ్లే వయసు నుంచి బతుకుదెరువు వరకు కలిసే నడిచారు. ఆదర్శంగా నిలిచారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం నీర్మాలకు చెందిన కొత్త జలంధర్‌రెడ్డి, కూతాటి నర్సింహులు పదో తరగతి వరకు కలిసి చదివారు. ఉన్నత చదువులకు వెళ్లకపోయినా ఆ ప్రాంత వామపక్ష భావజాలంతో ఇరువురు పలు ప్రజాస్వామిక ఉద్యమాల్లో చురుగ్గా పనిచేశారు. రాజకీయ, సామాజిక ఉద్యమాల్లో రాణిస్తూ ఆఖరికి బతుకుదెరువు కోసం సైతం ఇరువురు వ్యాపారంలోనూ కలిసే పనిచేస్తున్నారు.

బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్



హన్మకొండ: సమాజానికి సేవ చేయాలనే సదుద్దేశ్యంతో 10 మందితో మొదలైన బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వాట్సాప్ గ్రూప్. ప్రస్తుతం వేయి మందితో నడుస్తోంది. ఆర్థిక సమస్య కారణంగా ఎవరూ చదువు మానేయవద్దనే లక్ష్యంతో ఈ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు ప్రభుత్వ ఉపాధ్యాయుడు పులి దేవేందర్, డిప్యూటీ తహసీల్దార్ పతంగి భాస్కర్‌తో పాటు మరికొంత మంది మిత్రులు. 2020లో మొదలైన ఈ ఫౌండేషన్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పేద విద్యార్థులకు ఆర్థికసాయం, పాలిసెట్ బుక్స్ పంపిణీ, పోటీ పరీక్షల పుస్తకాలు, మెటీరియల్ అందజేత, తల్లిదండ్రులను కోల్పోయిన నిరుపేదలకు ఆర్థిక సహాయం. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు భరోసా కల్పిస్తూ వారికి ఆర్థిక చేయూతనందిస్తూ ముందుకుసాగుతోంది.

ఆడపిల్లల్లో స్నేహితుడిని చూసుకుంటూ



కేసముద్రం: బాల్యమిత్రుడు మృతి చెందాడు. అతని ఇద్దరు కూతుళ్లు అనాథలయ్యారు. ఆ ఆడబిడ్డల్లో స్నేహితుడిని చూసుకుంటున్నారు కేసముద్రానికి చెందిన ఎస్‌వీవీ హైస్కూల్‌కు చెందిన 1996–97 ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రులు. వెంకటగిరి గ్రామానికి చెందిన గాండ్ల అశోక్ మొదటి భార్యకు కూతురు పుట్టగానే ఆమె మృతిచెందింది. ఆ తర్వాత రెండో భార్యకు మరో కూతురు జన్మించగానే అశోక్ చనిపోయాడు. తండ్రిని కోల్పోయిన ఆ ఇద్దరు చిన్నారుల పరిస్థితిని చూసి స్పందించారు ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థులు. ఆ ఇద్దరు ఆడపిల్లల పేరుమీద సుకన్య సమృద్ధి యోజన కింద ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. ఏటా రూ.45వేల ఫీజు చెల్లిస్తూ పెద్దకూతురు శివానిని(6వ తరగతి) నర్సంపేటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్నారు.



ముందస్తు స్నేహితుల దినోత్సవం సందర్భంగా నల్లబెల్లి మండల కేంద్రంలోని శ్రీవిద్యానికేతన్ హైస్కూల్‌లో శనివారం దోస్త్ అక్షరాల ఆకారంలో విద్యార్థులు కూర్చున్నారు. - నల్లబెల్లి

ఆడపిల్లలకు ఆర్థిక చేయూత



స్నేహితుడి కుమార్తెకు స్నేహితుల ఆర్థిక సహకారం(ఫైల్)

ఖానాపురం: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో 1996–97లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు మూడేళ్ల క్రితం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకుని వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసుకున్నారు. వీరితో పాటే 6 నుంచి 9వ తరగతి చదివిన వారిని సైతం యాడ్ చేసుకున్నారు. ప్రస్తుతం సుమారు 50 మందితో గ్రూప్ సాగుతోంది. స్నేహితుల్లో ఎవరికి ఏ కష్టమొచ్చినా తామున్నామనే భరోసా కల్పిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 14 మంది స్నేహితులకు వారి కుమార్తెల పెళ్లి సమయంలో ఆర్థికతోడ్పాటు అందించారు.

స్నేహితుల సంఘం!



గీసుకొండ: గ్రేటర్ వరంగల్‌లోని 16వ డివిజన్ ధర్మారంలో 12 ఏళ్ల క్రితం స్నేహితులు ప్రారంభించిన కోట మెసమ్మ తల్లి పరపతి సంఘం (స్నేహితుల సంఘం) ఆదర్శంగా నిలుస్తోంది. 2014 ఆగస్టు 15న తొమ్మిది మంది స్నేహితులు కలిసి ఏర్పాటు చేసిన సంఘంలో ప్రస్తుతం 24 మంది సభ్యులున్నారు. ప్రస్తుతం సంఘం రూ. 50 లక్షల టర్నోవర్‌తో లావాదేవీలు నిర్వహిస్తోంది. అవసరం ఉన్న వారికి 0.5 వడ్డీతో రుణాలిస్తున్నారు. సంఘంలోని సభ్యుడు ఎవరైనా మృతి చెందితే వారి కుటుంబానికి రూ.లక్ష సాయం అందిస్తున్నారు. ఏటా ఫ్రెండ్ షిప్ డే రోజున సంఘం వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు.

డీజీపీ జితేందర్‌ని సన్మానిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్, చిత్రంలో జైళ్లశాఖ డీజీపీ డాక్టర్ సౌమ్య మిశ్రా, కలెక్టర్లు సత్య శారద, స్నేహ శబరీష్, డీసీపీలు



ముగిసిన పోలీస్ డ్యూటీమీట్ - వివరాలు 8లో

వరంగల్ మామునూరు పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో మూడురోజులుగా జరుగుతున్న రెండో తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్ శనివారం ముగిసింది. ఓవరాల్ చాంపియన్‌షిప్ సైబరాబాద్ కమిషనరేట్ పోలీసులు గెలుచుకున్నారు. ముగింపు కార్యక్రమంలో డీజీపీ డాక్టర్ జితేందర్, జైళ్లశాఖ డీజీపీ డాక్టర్ సౌమ్య మిశ్రా, సీపీ సన్‌ప్రీత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. - మామునూరు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



భోజనం నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హన్మకొండ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్.. అధికారులు, సిబ్బందికి సూచించారు. హనుమకొండ టీవీ టవర్ కాలనీలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం (బీ), బాలసముద్రంలోని బాలికల వసతి గృహం (ఏ)ను శనివారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులకు కోసం సిద్ధం చేసిన భోజనం, కూరలను పరిశీలించారు. రిజిస్టర్లు, బియ్యం, ఇతర వంట సామగ్రిని తనిఖీ చేశారు. . విద్యార్థుల సంఖ్య, వారి హాజరుశాతాన్ని వార్డెన్‌లను అడిగి తెలుసుకున్నారు. మెనూ చార్ట్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. తాజా కూరగాయలనే వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ డీడీ నిర్మల, ఏఎస్‌డబ్ల్యూ కృష్ణ, వార్డెన్లు పాల్గొన్నారు.

ఐనవోలు మల్లికార్జునస్వామి హుండీ లెక్కింపు

- రూ.40.73 లక్షల ఆదాయం



హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ అద్దంకి నాగేశ్వర్ రావు, పరిశీలకులు అనిల్ కుమార్

ఐనవోలు: ఐనవోలు శ్రీమల్లికార్జున స్వామి దేవాలయ హుండీ లెక్కింపు కార్యక్రమం దేవాదాయశాఖ పరిశీలకులు డి.అనిల్ కుమార్ పర్యవేక్షణలో శనివారం నిర్వహించారు. గత మే 6నుంచి ఈ నెల 2వ తేదీ వరకు హుండీల్లో రూ.6,53,015, వివిధ ఆర్జిత సేవా టికెట్ల ద్వారా రూ.34,20,073 రాగా, మొత్తం రూ.40,73,088ల నగదు సమకూరినట్లు ఈఓ అద్దంకి నాగేశ్వరరావు తెలిపారు. హుండీల్లో లభ్యమైన వెండి, బంగారాన్ని యథావిధిగా హుండీలోనే వేసి సీల్ చేశామన్నారు. లెక్కింపులో కానిస్టేబుళ్లు శ్రీనివాస్, జి.పరమేశ్వరి, అర్చక సిబ్బంది, ఒగ్గు పూజారులు, మహబూబాబాద్ శ్రీ లక్ష్మి వేంకటేశ్వర సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్.. భవిష్యత్‌కు మార్గనిర్దేశం

రామన్నపేట: ఇంటర్మీడియట్ విద్య.. భవిష్యత్‌కు మార్గనిర్దేశమని జూనియర్ ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ పూజ పేర్కొన్నారు. వరంగల్ కృష్ణాకాలనీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ పూజ మాట్లాడుతూ విద్యార్థి దశలో సోషల్ మీడియాలో వచ్చే పోస్టింగ్‌లకు స్పందించవద్దని సూచించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు వనమాల, ప్రవళిక పాల్గొన్నారు.

నగరాన్ని తలపించేలా పరకాల

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవూరి

పరకాల: వరద ముంపునకు గురికాకుండా ప్రణాళికబద్ధంగా అంచెల వారీగా నగరాన్ని తలపించేలా పరకాల పట్టణాన్ని సుందరీకరించనున్నట్లు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. గత పాలకుల స్వార్థపూరిత ప్రయోజనాలు, నిర్లక్ష్యం మూలంగా అభివృద్ధిలో పరకాల పట్టణం వెనకబడిపోయిందని ఆరోపించారు. పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 14, 19వార్డులలో జరుగుతున్న డ్రైనేజీల నిర్మాణపు పనులను శనివారం ఎమ్మెల్యే రేవూరి పరిశీలించారు. అధికారుల పర్యవేక్షణలో నాణ్యతతో కూడిన పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..సుమారు రూ.24 కోట్లతో పరకాల పట్టణ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశామని, అభివృద్ధి పనుల్లో పట్టణ ప్రజలకు తాత్కాలికంగా ఇబ్బందులు కలగవచ్చని, కానీ భవిష్యత్‌తరాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అమృత్ పథకం కింద మంచినీటి వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చిన్న వర్షాలకే వరద ముంపునకు గురవుతున్న పరకాలను కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలతో నివేదిక రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో పరకాల మున్సిపల్ కమిషనర్ కె.సుష్మా, ఏఈ రంజిత్, శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కొలుగూరి రాజేశ్వర్‌రావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, మడికొండ సంపత్, రాంమూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ

పరకాలలోని 14వవార్డులో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న బోధన, పుస్తకాల పంపిణీని అడిగి తెలుసుకున్నారు.

స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితా వెల్లడి

- ఒక్కో వేకెన్సీ పోస్టుకు ముగ్గురి పేర్లు
- నేడు అభ్యంతరాల స్వీకరణ

విద్యారణ్యపురి: హనుమకొండలోని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ పరిధిలోని మల్టీజోన్ 1లోని 19 జిల్లాలకు సంబంధించిన స్కూల్ అసిస్టెంట్‌లకు హెడ్మాస్టర్ల గ్రేడ్ 2 పదోన్నతులు కల్పించనున్న నేపథ్యంలో ఆయా స్కూల్ అసిస్టెంట్‌ల సీనియారిటీ జాబితాను ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి శనివారం వెల్లడించారు. ఒక్కో వేకెన్సీ పోస్టుకు ముగ్గురు స్కూల్ అసిస్టెంట్‌లతో కూడిన సీనియారిటీ జాబితా ప్రకటించారు. ఈమేరకు ఆయా జిల్లాల డీఈవోలకు కూడా ఈమెయిల్ ద్వారా పంపారని తెలిసింది. ఆయా సీనియారిటీ లిస్టులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 3న డీఈవో కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుంది. ఈనెల 4, 5 తేదీల్లో ఆయా స్కూల్ అసిస్టెంట్‌ల అభ్యంతరాలు పరిష్కరిస్తారు. అనంతరం తుది సీనియారిటీ జాబితా వెల్లడిస్తారు. షెడ్యూల్ ప్రకారం వెబ్‌ఆప్షన్లకు ఈనెల 6న అవకాశం ఇచ్చారు. అలాగే ఎడిట్ ఆప్షన్ ఇచ్చారు. ఈనెల 7న హెచ్‌ఎం గ్రేడ్ 2 పదోన్నతులకు ఉత్తర్వులు జారీ చేస్తారు. ఇదిలా ఉండగా మల్టీజోన్ –1పరిధిలో లోకల్ బాడీలోని ఉన్నత పాఠశాలల్లో హెడ్మాస్టర్ల గ్రేడ్–2 వేకెన్సీలు 451 ఉండగా ప్రభుత్వ హైస్కూల్స్‌లో 55 ఉన్నట్టు సమాచారం.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

● కమాండెంట్ కల్నల్ ఎస్ఎస్ రామదురై



శిక్షణ పొందిన ఎన్‌సీసీ కేడెట్లతో ఎన్‌సీసీ ఆఫీసర్లు తదితరులు

కేయూ క్యాంపస్: ఎన్‌సీసీతో క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని కమాండెంట్ కల్నల్ ఎస్ఎస్ రామదురై అన్నారు. కాకతీయ యూనివర్సిటీలో గత నెల 24 నుంచి నిర్వహిస్తున్న ఎన్‌సీసీ పదో తెలంగాణ బెటాలియన్ వరంగల్ గ్రూప్ క్యాంపు శనివారం సాయంత్రం ముగిసింది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు. న్యూఢిల్లీలో వచ్చే ఏడాది జనవరి 26న రిపబ్లిక్‌డే పరేడ్‌లో పాల్గొనేందుకు ఇక్కడ ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ ఇచ్చారు. ఇందులో 120 మందిని ఎంపిక చేశారు. అందులో డ్రిల్, బెస్ట్ క్యాడెట్స్, కల్చరల్, ఫ్లాగ్‌ఏరియా విభాగాల్లో ఎంపిక చేశారు. కార్యక్రమంలో క్యాంపు ఆడమ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రవిసునారే, కెప్టెన్ డాక్టర్ పి.సతీశ్, కెప్టెన్ డాక్టర్ ఎం. సదానందం, సుబేదారిమేజర్ జైరామ్‌సింగ్, రవీందర్, సందీప్, రాధాకృష్ణ, రాజమాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీటీ సూచనలు అమలు చేయండి





న్యూశాయంపేట : సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద మామునూరు : కార్యక్రమంలో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

● వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద

న్యూశాయంపేట: నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) సూచనలు అమలు చేయాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, మున్సిపల్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో కలెక్టర్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌జీటీ నిబంధనల ప్రకారం వరంగల్ కోట చెరువును శుభ్రం చేయించాలని, ప్రస్తుతం ఉన్న లెగసి వ్యర్థాలను టెండర్ ప్రాసెసింగ్ చేయాలన్నారు. ఎన్‌జీటీ విధివిధానాల ప్రకారం 17 ఎకరాల భూమిని రాంపూర్ డంపింగ్ యార్డ్‌లో నిర్వహించడంతోపాటు బయోమైనింగ్ పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ల్యాండ్‌కు టెండర్ ప్రక్రియ పూర్తి చేసినట్లు, నియంత్రించడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ఏర్పాటు చేసినట్లు బల్దియా కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ తెలిపారు. మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించాలని సూచించారు. పాఠశాల విద్యార్థులకు మట్టితో వినాయక ప్రతిమలను తయారు చేసేలా శిక్షణ ఇచ్చి వాటిని కొనుగోలు చేసేలా చూడాలని కలెక్టర్ అన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ విజయలక్ష్మి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సునీత, బల్దియా సీఎంహెచ్‌ఓ రాజారెడ్డి, ఇన్‌చార్జ్ ఎస్ఈ మహేందర్, ఎంహెచ్‌ఓ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌లో సభ్యత్వం తీసుకోవాలి

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో ప్రజలు, యువకులు సభ్యత్వం తీసుకొని సేవచేయాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద సూచించారు. కలెక్టరేట్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో రాష్ట్రపాలక మండలి సభ్యుడు శ్రీనివాస్‌రావు, డీఈఓ జ్ఞానేశ్వర్, జిల్లా సహకార అధికారి నీరజ, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, ఐఆర్ఎస్ ఎంసీ మెంబర్ నాడెం శాంతికుమార్, కోశాధికారి రాజేశ్వర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడిపై అవగాహన ఉండాలి

మామునూరు: పంట మార్పిడిపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద సూచించారు. మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన ఏరువాక రైతుబడి కార్యక్రమంలో పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రధాని నరేంద్రమోదీ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసి నుంచి వర్చువల్‌గా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి విడుదల కార్యక్రమాన్ని కలెక్టర్‌తోపాటు రైతులు వీక్షించారు. జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్‌రావు, మండల స్పెషల్ అఫీసర్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి పుష్పలత, రైతులు పాల్గొన్నారు.

రేపటినుంచి ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీలు

● హనుమకొండ వైద్యాధికారి అప్పయ్య



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

హసన్‌పర్తి: హనుమకొండ జిల్లాలో నిర్వహిస్తున్న ప్రైవేట్ క్లినిక్‌లు, ఆస్పత్రులను సోమవారంనుంచి తనిఖీలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి అప్పయ్య తెలిపారు. హసన్‌పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆయన ప్రత్యేక బృందం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనిఖీల కోసం డాక్టర్, హెల్త్‌అసిస్టెంట్‌తోపాటు 15 మందితో కూడిన బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తనిఖీల సందర్భంగా క్లినిక్, ఆస్పత్రి నిర్వహణకు అనుమతి ఉందా? అనుమతి ఉంటే క్లినిక్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం మేరకు నిర్వహిస్తున్నారా అన్న వివరాలు సేకరిస్తారన్నారు. వైద్యుల పేర్లు, వారు అందిస్తున్న వివరాల పట్టిక, పొల్యూషన్ సర్టిఫికెట్, బయో మెడికల్ సర్టిఫికెట్, ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తున్నారా.. లేదా అన్న అంశాలను సైతం పరిశీలించనున్నట్లు చెప్పారు. నిబంధలకు విరుద్ధంగా క్లినిక్ నిర్వహించినట్లయితే తనిఖీల్లో వెల్లడైన పక్షంలో సదరు క్లినిక్ నిర్వాహకుడికి నోటీసులు జారీ చేయడమే కాకుండా జరిమానాలు కూడా విధిస్తామని హెచ్చరించారు. సమావేశంలో డాక్టర్ భార్గవ్, జిల్లా మాస్ మీడియా అధికారి డాక్టర్ అశోక్‌రెడ్డి, గణాంకాధికారి జి.ప్రసన్నకుమార్, డాక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లు,సిబ్బంది పాల్గొన్నారు.

ఈజేహెచ్ఎస్ తనిఖీ

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఆవరణలోని ఈజేహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌ను శనివారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య తనిఖీ చేశారు. మెడికల్ స్టాక్ రికార్డులు, ఓపీలో వైద్యసేవలు, ల్యాబ్ ఇతర విభాగాలను పరిశీలించారు. ఆయనవెంట కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ నిఖిల్, డాక్టర్లు చరణ్, సుస్మిత, చైతన్య తదితరులు ఉన్నారు.

బాలింతలకు అవగాహన కల్పించాలి

తల్లిపాల ప్రాముఖ్యతపై బాలింతలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ అప్పయ్య సిబ్బందికి సూచించారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇచ్చే సూచనలను తల్లులు పాటించాలన్నారు. కార్యక్రమంలో జీఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, కేయూ పాలక మండలి సభ్యురాలు అనితారెడ్డి, డాక్టర్లు మహేందర్, సుబాష్, సీడీపీఓ విశ్వజ, గీత, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనభ్యసించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న షఫియుల్లా

న్యూశాయంపేట: విద్యార్థులు విలువలతో కూడిన విద్యనభ్యసించాలని, కమిషనర్ మైనారిటీ వెల్ఫేర్, తెలంగాణ మైనారిటీ గురుకులాల (టెమ్రిస్) కార్యదర్శి బి.షఫియుల్లా అన్నారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన గురుకులాలను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు తీసుకురావాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్ఎల్‌సీ డాక్టర్ జంగా సతీశ్, విజిలెన్స్ అధికారులు సయ్యద్ అక్బర్, మక్బూల్‌పాషా, అకడమిక్ కోఆర్డినేటర్ రుహీనా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 16 గురుకుల పాఠశాలలు, కళాశాలల పరిధి ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మనసు - మనిషి పుస్తకావిష్కరణ

హన్మకొండ కల్చరల్ : వరంగల్ ఉదయం మిత్ర మండలి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సైకాలజిస్ట్, కౌన్సెలింగ్ ఎక్స్‌పర్ట్ మెండు ఉమామహేశ్వర్ రచించిన మనసు– మనిషి వ్యక్తిత్వ వికాస పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఉదయం 10గంటలకు హనుమకొండ కిషన్‌పుర వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో ఉంటుందని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కవులు, రచయితలు పాల్గొనాలని కోరారు.

పిల్లలు, మహిళలపై అకృత్యాలను నివారించాలి

● హనుమకొండ డీఐఈఓ ఎ.గోపాల్



మాట్లాడుతున్న డీఐఈఓ గోపాల్

విద్యారణ్యపురి: మహిళలు, పిల్లలపై జరుగుతున్న అకృత్యాలను వ్యతిరేకించి, వారికి సురక్షిత వాతావరణం కల్పించాలని హనుమకొండ డీఐఈఓ ఎ.గోపాల్ పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండలోని ప్రభుత్వ వృత్తివిద్య జూనియర్ కాలేజీలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్), హనుమకొండ భరోసా సెంటర్ సంయుక్తంగా ఆ కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్ అధ్యక్షతన 'పిల్లలు, మహిళలపై లైంగిక వేధింపులు' అనే అంశంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఐఈవో మాట్లాడుతూ..మహిళలు, పిల్లలపై జరుగుతున్న లైంగిక హింసను అరికట్టాలన్నారు. మహిళలు, బాలికల రక్షణ కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భరోసా సెంటర్ నిర్వహిస్తున్న కౌన్సిలర్ సుమత పేర్కొన్నారు. కార్యక్రమంలో భరోసా సపోర్ట్ పర్సన్ కె.రజిత, కైలాష్, షేర్ ఎన్జీవో ఆర్గనైజేషన్ సభ్యులు ఆర్.జమున, బి.జగన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఆర్.ప్రవీణ్‌కుమార్, సవ్వాసి శ్రీనివాస్, స్టూడెంట్ కౌన్సిలర్ డి.రవి, కె.రేణుక, విద్యార్థులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు

న్యూశాయంపేట: ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు ఉంటాయని వరంగల్ జెడ్పీ సీఈఓ రాంరెడ్డి అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమశాఖ, వైద్య, ఆరోగ్యశాఖ, అధికారులు, సిబ్బందితో బుధవారం ఇంటర్నల్ కన్వర్జెన్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ జిల్లాస్థాయిలో రెండు శాఖలు అతి ముఖ్యమైనవని, గ్రామాల్లో ఇరుశాఖలు కలిసి పనిచేస్తే మెరుగైన ఫలితాలు రాబట్టవచ్చన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి రాజమణి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు, ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్లు, మెడికల్ ఆఫీసర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌లుపాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

● హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పట్టాభిరామారావు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పట్టాభిరామారావు

హసన్‌పర్తి: పని ప్రదేశాల్లో మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పట్టాభిరామారావు హెచ్చరించారు. శనివారం హసన్‌పర్తి మండలం అన్నాసాగరం శివారులోని సుమతిరెడ్డి మహిళ ఇంజినీరింగ్ కళాశాలలో పోష్(లైంగిక వేధింపుల నివారక చట్టం)–2013పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పట్టాభిరామారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పని ప్రదేశంలో మహిళలకు ఏదైనా సమస్య ఉత్పన్నమైనప్పుడు ఎలా రక్షించుకోవాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అనే అంశాలపై వివరించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ క్షమాదేశ్ పాండే మాట్లాడుతూ సమస్యలు వచ్చినప్పుడు మౌనంగా ఉండకుండా ధైర్యంగా ఎదరించాలన్నారు. పోష్ కమిటీ చైర్మన్ అనితారెడ్డి మాట్లాడుతూ..మహిళలకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. న్యాయమూర్తి శ్రావణ స్వాతి, కళాశాల ప్రిన్సి పల్ రాజశ్రీరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులి సత్యనారాయణ, ఏఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై అవగాహనకే ప్రహరీ క్లబ్‌లు

● హనుమకొండ డీఈఓ వాసంతి



మాట్లాడుతున్న డీఈఓ వాసంతి

విద్యారణ్యపురి: రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించేందుకే ప్రభుత్వం ప్రహరీక్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు హనుమకొండ డీఈఓ డి.వాసంతి తెలిపారు. శనివారం హనుమకొండ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లకు, ప్రధానోపాధ్యాయులకు ప్రహరీక్లబ్‌ల ఏర్పాటు, మాదద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడానికి భీమారంలోని స్కిల్‌స్టోర్క్ స్కూల్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో డీఈఓ మాట్లాడారు..పాఠశాల హెచ్ఎం చైర్మన్‌గా, ఓ ఉపాధ్యాయుడు వైస్‌చైర్మన్‌గా, ప్రతీ తరగతి నుంచి ఒక బాలుడు, ఒక బాలిక చొప్పున ఆరు నుంచి పదో తరగతి వరకు ప్రహరీ క్లబ్ కమిటీ ఉంటుందన్నారు. యాంటీడ్రగ్స్ నార్కొటిక్స్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. పాఠశాలల సమీపంలో ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తే వెంటనే 1908కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్, జిల్లా కమ్యూనిటీ మొబలైజింగ్ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి, ఆచార్యులు రవికుమార్, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో స్పాట్ అడ్మిషన్లు

హనుమకొండ జిల్లాలోని కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లకు 4న అవకాశం కల్పించామని డీఈఓ వాసంతి తెలిపారు. ముల్కనూరు కేజీబీవీలో 22, ధర్మసాగర్ సీఈసీలో 15, ఎల్కతుర్తిలో 48, హసన్‌పర్తి సీఈసీలో 14, శాయంపేట బీపీసీలో 20, వేలేరు కేజీబీవీలో 33 సీట్లకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ముల్కనూరు మోడల్ స్కూల్‌లో 158, కళాశాలలో 49, ఎల్కతుర్తి మోడల్ స్కూల్‌లో 234, కళాశాలలో 47, కమలాపూర్ మోడల్ స్కూల్‌లో 311 సీట్లు, కళాశాలలో 18 సీట్లు భర్తీకి అవకాశం కల్పించామన్నారు. ఆసక్తిగల విద్యార్థులు మార్కుల జాబితాలు, ఆధార్ కార్డు, టీసీతో సంబంధిత పాఠశాలల ప్రిన్సిపాళ్లను కలిసి అడ్మిషన్లు పొందాలన్నారు.

నైపుణ్యంతోనే ప్రజలకు న్యాయం

నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి

● కఠోర సాధనతోనే విజయాలు
● డీజీపీ డాక్టర్ జితేందర్
● ముగిసిన రాష్ట్ర స్థాయి 2వ పోలీస్ డ్యూటీమీట్–2025



మాట్లాడుతున్న డీజీపీ జితేందర్, వేదికపై జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రా, సీపీ సన్‌ప్రీత్ సింగ్ తదితరులు



మాట్లాడుతున్న జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రా, వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్



మొక్కనాటి నీరు పోస్తున్న డీజీపీ జితేందర్

మామునూరు: పోలీస్ అధికారులు విధుల్లో ఉత్తమ నైపుణ్యం ప్రదర్శించినప్పుడే ప్రజలకు సరైన న్యాయం లభిస్తుందని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. వరంగల్ మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల పరేడ్ గ్రౌండ్‌లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సీపీ సన్ ప్రీత్‌సింగ్ పర్యవేక్షణలో మూడు రోజులుగా నిర్వహించిన తెలంగాణ పోలీస్ 2వ డ్యూటీ మీట్–2025 శనివారం ముగిసింది. ఈ ముగింపు వేడుకలకు డీజీపీ జితేందర్, జైళ్ల శాఖ డీజీపీ డాక్టర్ సౌమ్యమిశ్రా ముఖ్యఅతిథులుగా హాజరై డ్యూటీ మీట్ విజేతలకు ట్రోఫీలు, షీల్డ్‌లు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో అత్యధిక మెడల్స్ సాధించిన సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించగా డీజీపీ ట్రోఫీ అందజేశారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ రాష్ట్ర పోలీసు సిబ్బంది ఇదే స్ఫూర్తితో రాబోయే జాతీయ స్థాయి డ్యూటీ మీట్‌కు సిద్ధం కావాలని, లక్ష్యం ఎంచుకుని కఠోర సాధన చేసి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. పోలీస్ అధికారులు క్రమ శిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలన్నారు. అనంతరం జైళ్ల శాఖ డీజీపీ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ రెండోసారి వరంగల్‌లో రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్ ముగింపు కార్యక్రమానికి రావడం సంతోషంగా ఉందన్నారు. తాను ఎస్పీగా ఉన్న సమయంలో నిర్వహించిన డ్యూటీ మీట్ గుర్తుకు వస్తోందని పేర్కొన్నారు.

పోటీల్లో అధికారుల సత్తా ..

రాష్ట్ర స్థాయి రెండో పోలీస్ డ్యూటీ మీట్–2025లో ఓవరాల్ చాంపియన్ షిప్ ట్రోఫీని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ అందుకుంది. సైంటిఫిక్ ఎయిడ్, యాంటీ సబటేజ్ చెక్, కంప్యూటర్ అవేర్‌నెస్, డాగ్ స్క్వాడ్, ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫీ, వీడియోగ్రఫీలకు సంబంధించి 25 విభాగాల్లో పోటీలు జరగగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ 4 ట్రోఫీలు, 17 పతకాలు కైవసం చేసుకుంది. ఇందులో 6 గోల్డ్ మెడల్స్, 7 సిల్వర్, 4 బ్రాంజ్ (కాంస్య) మెడల్స్ ఉన్నాయి. సైంటిఫిక్ ఎయిడ్ టు ఇన్వెస్టిగేషన్ పోటీల్లో సైబరాబాద్ కమిషనరేట్ ప్రథమ స్థానం, హైదరాబాద్ కమిషనరేట్ ద్వితీయ స్థానం, భద్రాచలం జోన్ తృతీయ స్థానం, యాంటీ సబటేజ్ చెక్‌లో ఇంటెలిజెన్స్ ప్రథమ స్థానం, సైబరాబాద్ కమిషనరేట్ ద్వితీయ స్థానం, డాగ్ స్క్వాడ్ కాంపిటీషన్‌లో సీఐడీ హైదరాబాద్ ప్రథమ స్థానం, ఇంటెలిజెన్స్ (ఐఎస్‌డబ్ల్యూ) ద్వితీయ స్థానం, బెస్ట్ డాగ్‌లో కాళేశ్వరం జోన్ ప్రథమ స్థానం, కంప్యూటర్ అవేర్‌నెస్, ఫొటోగ్రఫీ పోటీల్లో ఐటీ అండ్ సీ హైదరాబాద్ ప్రథమ స్థానం, ఇంటెలిజెన్స్ హైదరాబాద్ ద్వితీయ స్థానం, వీడియో గ్రఫీ పోటీల్లో సైబరాబాద్ కమిషనరేట్ ప్రథమ స్థానం, హైదరాబాద్ కమిషనరేట్ ద్వితీయ స్థానం సాధించి పతకాలు అందుకున్నాయి.

అతిథులకు గౌరవ వందనం ..

రాష్ట్ర స్థాయి 2వ పోలీస్ డ్యూటీ మీట్–2025 ముగింపు వేడుకల్లో 450 మంది అధికారులు, సిబ్బంది జెండాలు చేతబూని డీజీపీ జితేందర్ రెడ్డి, జైళ్ల శాఖ డీజీపీ సౌమ్య మిశ్రాకు గౌరవ వందనం సమర్పించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ ముగింపు వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా పోలీసు కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐడీ డీఐజీ నారాయణనాయక్, వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లు సత్యశారద, స్నేహ శబరీశ్, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లా ఎస్పీలు కిరణ్ ఖరే, సుధీర్ రామ్‌నాథ్ కేకన్, పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ, టీజీ ఎన్పీడీజీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, బల్దియా కమిషనర్‌చాహత్ బాజ్‌పాయ్, డీసీపీలు, అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో భాగంగా రింగ్ నుంచి దూకుతున్న పోలీస్ డాగ్



సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా నృత్యం చేస్తున్న కళాకారులు

జ్వరంతో చిన్నారి మృతి



మాన్య(ఫైల్)

నర్సంపేట: జ్వరంతో ఓ చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన చెన్నారావుపేటలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన బట్టి సంతోష్, సరిత దంపతుల కూతురు మాన్య(2) వారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. దీంతో కుటుంబీకులు చిన్నారిని నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాయి. శనివారం పరిస్థితి విషమంగా ఉండడంతో మళ్లీ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. అల్లారు ముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కూతురు మృతి చెందడంతో తల్లిదండ్రులు చిన్నారి మృతదేహం మీద పడి గుండెలవిసేలా రోదించారు.

ఇసుక లారీ యజమానులపై కేసు నమోదు

వరంగల్ క్రైం: నిబంధనలకు విరుద్ధంగా హనుమకొండ కేఎల్ఎన్‌రెడ్డి కాలనీలోని ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన నిర్వహించిన ఇసుక లారీ యజమానులపై కేసు నమోదు చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ ఎం.రంజిత్‌కుమార్ తెలిపారు. జూలై 31న దామెర మండలం ఒగ్లాపూర్ గ్రామంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, మైనింగ్, ఆర్‌టీఏ, రాష్ట్ర పన్నుల శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టి ఓవర్ లోడ్ ఉన్న లారీలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. దీనికి నిరసనగా లారీ యజమానులు విజిలెన్స్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడంతో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఇసుక లారీల యాజమాన్యం అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయుడితో పాటు మరో 20 మందిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వరంగల్ జిల్లాలో 'మిషన్ తేజస్'

● మిషన్ రూపకర్త వరంగల్ కుర్రాడు గుండు అనిరుధ్



గుండు అనిరుధ్

విద్యారణ్యపురి: సమగ్రశిక్ష తెలంగాణ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ నవీన్ నికోలస్ అనుమతితో వరంగల్ జిల్లాకు చెందిన ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి గుండు అనిరుధ్ ఆధ్వర్యంలో మిషన్ తేజస్ (తెలంగాణ జ్ఞాన ఆవిష్కరణ సంకలం) నూతన ఆవిష్కరణ కార్యక్రమాన్ని ప్రారంభించబోతున్నారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించి ఆ స్కూళ్లను స్మార్ట్ ఇన్నోవేషన్‌గా మార్చేందుకు దోహదపడుతుంది. ప్రభుత్వానికి లేదా పాఠశాల విద్యాశాఖకు ఎలాంటి ఆర్థిక బాధ్యత ఉండొద్దనే నిబంధనతో ఈ కార్యక్రమానికి అనుమతినిస్తూ సమగ్రశిక్ష రాష్ట్ర డైరెక్టర్ అనుమతి ఇచ్చారు. ఈ మేరకు ఆ ప్రాజెక్టు అడిషనల్ డైరెక్టర్ ఎం. రాధారెడ్డి ఈనెల 1న ప్రొసీడింగ్ జారీ చేశారు. ఈ మిషన్ ప్రారంభదశలో వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారికి జిల్లాలోని 10 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి అమలు చేయాలని పేర్కొన్నారు. సంబంధిత ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, ప్రతీ విద్యార్థి భద్రత,సైబర్ భద్రతాపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఆమోదం లభించింది. శనివారం అనిరుధ్ తన తండ్రితో కలిసి వరంగల్ జిల్లా డీఈఓ మామిడాల జ్ఞానేశ్వర్‌ను కలిశారు. త్వరలోనే 10 ప్రభుత్వ పాఠశాలలను ఎంపికచేసే అవకాశం ఉంది.